# మహా ఇల్లాలు

అలివేలు మొగుడి చేతిలో దెబ్బలు తిని సావిట్లో చాపమీద ఏడుస్తూ పడుకుంది.

“నాన్న కొట్టారా ! ఏడవకే” అంటూ ఐదేళ్ళపిల్లాడు చిట్టిచేతులతో తల్లి బుగ్గలు తుడిచాడు.

ఏడేళ్ళ పెద్దపిల్ల మూల నిలబడి బితుకుబితుకున చూస్తోంది. మూడేళ్ళ పిల్ల తల్లి ఏడవడం చూసి బిక్కమొహం పెట్టింది.

ఏం తెలీని ఏణ్ణర్థం పిల్ల పొట్ట తడిపేసుకుని, చేతులు తపతప కొట్టుకుంటూ చిన్మయానందంగా ఆడుకుంటోంది. అలివేలు చటుక్కున పిల్లాడిని కౌగలించుకుని “నా తండ్రీ ! నీకున్న ప్రేమలో పదోవంతన్నా మీనాన్నకి లేదురా. మీకోసమే బతుకుతున్నానురా — లేకపోతే ఆయన చేతిలో దెబ్బలు తినలేక, ఎప్పుడో ఏనుయ్యో, గొయ్యో చూసుకునే దాన్ని” .... అంటూ ఏం తెలీని ఆ పిల్లలతో తన మనసులో దుఃఖం చెప్పుకుంటూ ఏడ్చింది.

అలివేలు మొగుడసలెందుకు కొడ్తాడు ? అంటే, మొగుడు కనక· ఆమె చేసే ప్రతి పనిలో తప్పులు కనిపిస్తాయి. స్నానికి వేడినీళ్ళు వేడి చాలకపోతే మొహాన పోస్తాడు ఆనీళ్ళు, కూరలో ఉప్పు చాలకపోతే మొహాన విసురుతాడు కంచం. పెల్లిన్‌షర్టు ఉతకమన్నది మరచిపోతే చంప పగలగొడ్తాడు. బొత్తాం కుట్టమన్నది చేయి వీలుకాక కాస్త ఆలశ్యం చేస్తే వీపుమీద గుద్దులు గుద్దుతాడు. అలివేలు ఏనాడన్నా కాస్త ఎదిరించి జవాబు చెబితే, గోడకేసి తలబద్దలు కొడ్తాడు. రోజులో కనీసం ఒక వంకన్నా దొరుకుతుంది. అలివేలు వీపు బాజా బజాయించడానికి.

అసలు వెంకట్రావుకి అంతకోపం ఎందుకు పెళ్ళాంమీద. వెంకట్రావుకి తనమీద తనకి చాలా గొప్ప అభిప్రాయం ఉంది. అతనికి తనని పొరబాటుగా బీదగుమస్తాగా పుట్టించాడని దేముడిమీద కోపం. తను ఏ ఐ. ఏ. ఎస్. ఆఫీసరో కావల్సింది. తండ్రి బీదరికంవల్ల కాలేకపోయానని (బి. ఏ. మూడోసారి ప్యాసయినా) తండ్రిమీద కోపం. తన అందానికి ఏ రంభో దిగిరాకపోయినా, రంభలాంటి పెళ్ళాం రావల్సింది. కాని, యింట్లో పెళ్ళికాకుండా వుండిపోయిన పాతికేళ్ళ చెల్లెలి పెళ్ళికి, కట్నం డబ్బుల కాశపడి తండ్రి అలివేలు తండ్రినుంచి కట్నం పుచ్చుకుని తనకి అలివేలుని అంటగట్టాడని, చెల్లెలికోసం అన్న త్యాగం చేయాల్సి వచ్చిందని చెల్లెలిమీద కోపం — మొద్దులాంటి అలివేలు పెళ్ళాంగా దొరికిందని అలివేలు మీద కోపం — యిలా అందరిమీద కోపాలు యింకెవరిమీద చూపించినా ఊరుకోరని, కట్టుకున్న పెళ్ళాంమీద చూపించి కసితీర్చుకుంటాడు.

పాపం అలివేలు పట్టుమని పాతికేళ్ళు లేకుండానే నలభై ఏళ్ళ దానిలా కనిపిస్తుంది. అసలే కాస్త బొద్దు శరీరం. దానికి తోడు వెంట వెంట కాన్పులతో పొట్ట, నడ్డి విపరీతంగా పెరిగాయి. చూలింత, బాలింత చంటివెంట, పగలు చాకిరీ — రాత్రిపిల్లలతో నిద్రలేకపోవడంతో దవడలు పీక్కుపోయి, కళ్ళుగూరుకుపోయి వుసూరుమని వుంటుంది.

అలివేలు అలా తయారవడానికి కారణం తను అన్నది అతనికి అర్ధంకాదు. ఏటేటా పిల్లలనికని అలాతోలు అయింది అన్నది అతనికి తట్టదు. ఆయనగారు పెట్టిన దాసదాసీజనం ఎవరూ లేకపోవడంవల్ల, రోజంతా చాకిరీతో అలా యీసురోమని వుంటుందని ఆలోచించడు — ఆయనగారు కొనే ముతక నేత చీరలలో, ఇంతకంటె అందంగా కనపడదు అని అనుకోడు. "అలా గేదెలా వొళ్ళు పెంచకకోతే డైటింగ్ చెయ్యకూడదూ" అంటాడు. ఎప్పుడూ చూలెంత బాలెంతలతో తనెలా డైటింగ్‌లు చెయ్యగలదో అలివేలుకి అర్ధంగాదు, డైటింగ్‌లుచేసి పాలు, పళ్ళుతిని నాజూగ్గా తయారవడానికి డబ్బులా పారేయి, అని అడిగే ధైర్యం అలివేలుకిలేదు. రెండుపూటలా పట్టెడన్నం తినకపోతే, నీకూ నీపిల్లలకీ ఎలా

చాకిరీ చేస్తాను. అని జవాబు చెప్పాలని వున్నా, ఆ సాహసం ఆమెకిలేక. నలుగురు పనివాళ్ళని పెట్టి నైలక్స్‌లు, షిఫాన్‌లు కొను. నేనూ ముస్తాబయి యిరవై నాల్గుగంటలు కుర్చీ ఎక్కి కూర్చుంటాను. అని పైకి అడగలేదు అలివేలు.

అలివేలు పెళ్ళికాక పూర్వం ముద్దబంతి పూవులాగనే వుండేది. పెద్ద అందగత్తె కాకపోయినా - అలివేలు పల్లెటూళ్ళో పుట్టింది. ఆ వూళ్లో వున్న థర్డుఫారం చదివేసి, ఆ పైన చేసేదేంలేక హాయిగా పొద్దుటే చల్దన్నం తినేసి, పెరట్లో పూసిన పూలన్నీ దండగుచ్చుకు తల్లో పెట్టుకుని, సావిట్లో చాపేసుకు పడుకుని, యిక్కడా అక్కడా సంపాదించినవి, అన్నలు పట్నం నించి తెచ్చిన పుస్తకాలు, పత్రికలు అన్నీ క్షుణ్ణంగా చదివేసేది, ఆవిధంగా స్కూల్లో థర్డుఫారం చదివిన విజ్ఞానంకంటే, పత్రికలుగట్రా చదివి బాగానే లోకజ్ఞానం సంపాదించింది అన్నీ చదివి ఆ పదహారేళ్ళ కన్నె అందరి కన్నెపిల్లలలాగానే చాలా కలలు కంది. పట్నంలో ఉద్యోగంచేసే మొగుడు చిన్న ముచ్చటయిన ఇల్లు, సోఫా సెట్టు, కారు లేకపోయినా ఓ స్కూటరు ఆ స్కూటరుమీద జంటగా షికార్లు తిరగడం వగైరా కలలు చాలానేకంది. అలివేలు తండ్రి పెద్ద వున్నవాడు కాకపోయినా, ముగ్గురు మగపిల్లల తర్వాత పుట్టిన ఆడపిల్ల అలివేలుమంగ తాయారుని ముద్దుగానే పెంచి, వున్నంతలో చదువుకున్న ఉద్యోగస్తుడిని అల్లుడిగా తెచ్చుకోవాలనుకున్నాడు. ఆ తండ్రికి బి, ఏ. అంటే ఓ పెద్ద చదువు - గుమాస్తా ఉద్యోగం అంటే అంత మంచి ఉద్యోగం అని సంబరపడి, ఐదువేలు కట్నం, లాంఛనాలు యిచ్చి కాళ్ళుకడిగి అలివేలుని అతని చేతిలో పెట్టాడు,

కాపురానికి వెళ్ళాకగాని అలివేలు తన కలలకి, యదార్ధానికి చాలా వ్యత్యాసముందని గ్రహించలేకపోయింది,

తనంటే ఎందుకింత చిరాకో, ఎందుకలా మొహం మటమట లాడించుకుంటాడో - తనంటే యిష్టంలేనివాడు, పెళ్ళి ఎందుకు చేసుకున్నాడో ఆమె కీనాటివరకు అంతుబట్టలేదు. తన కర్మ అంతే అదృష్టం

యింతేనని సరిపెట్టుకుంది ఆ యిల్లాలు. మొగుడు కొట్టనినాడు పొంగిపోవడం, అవసరంతో దగ్గరకి తీసుకున్నప్పుడు లొంగిపోవడం, ఏనాడో, ఏ సినిమాకో తీసికెడితే పండగలా సంబరపడడం అంతే ఆమె జీవితం!

అలివేలు మెడలో పుస్తె కట్టేనాటికి వెంకట్రావు అదో రకం విరక్తిలో వుండేవాడు. అప్పటికే అతను కాలేజీలో ఒక అమ్మాయిని గాఢంగా ప్రేమించి, ఆ అమ్మాయికి ఉత్తరాలు గట్రా రాసి, ఆ అమ్మాయి చేతిలో చెంపదెబ్బ తిని, ప్రిన్సిపాల్‌చేత వార్నింగ్ యిప్పించుకున్నాడు. గాఢ ప్రేమ భగ్న ప్రేమలో మారేసరికి, తండ్రి వూరికే యింట్లో పెళ్ళో, పెళ్ళో అని ప్రాణం తీస్తుంటే, విరక్తిలో పళ్ళు డగ్గొట్టుకోడానికి తను ఎంచుకున్న రాయి కాక యింకేరాయి అయితేనేం, తను ప్రేమించిన పడతి దక్కనప్పుడు అలివేలు అయితేనేం, అప్పలమ్మ అయితేనేం, అన్న విరక్తిలో అలివేలు మెడలో పుస్తె కట్టేశాడు. పుస్తె కట్టాక ఆడదాని అవసరంతో పిల్లలని కన్నాడు. అలా ఏటేటా పిల్లల్ని కని ఎవరిమీదో కసి అలివేలు మీద తీర్చుకున్నట్టు సంతృప్తిపడ్డాడు ఇన్నాళ్లూ. ఆడది కనుక వెంకట్రావు మీద కసి తీర్చుకునే మార్గం అలివేలుకి లేక, మొగుడుదగ్గర కొచ్చినప్పుడెల్లా తిట్టుకుంటూ వళ్ళప్పగించక తప్పదు అలివేలుకి.

ఈ మధ్య అతని కోపం, చిరాకు, అసహ్యం వగైరా మరీ ఎక్కువయ్యాయి. దానికి కారణం అతని ఆఫీసుకి కొత్తగా వచ్చి చేరిన కలవారమ్మాయి గీత కారణం! గీతని చూస్తున్నకొద్దీ అతనిలో అసంతృప్తి మరింత పెరిగిపోయింది.

* * *

గీత ఆ ఆఫీసులో చేరి నాలుగు నెలలయింది. ఆ అమ్మాయి కలవారమ్మాయే. నిజంగా ఉద్యోగం అవసరం లేకపోయినా కాలక్షేపం కోసం అంటూ తండ్రి ప్రాణాలుతీసి ఈ ఆఫీసులో ఉద్యోగం సంపాదించింది. గీత గీతలా నాజూగ్గా ఉంటుంది, మోడర్న్‌గా తయారవుతుంది. అందంకంటె

ఆకర్షనీయంగా వుంటుంది, అందరితో సోషల్‌గా, చనువుగా వుంటూ, ఛలోక్తులు ఆడుతూ, ఆఫీసులో గల గల మాట్లాడుతూ - గిర గిర తిరుగుతూ కబుర్లు చెపుతూనే వుంటుంది. గీత ఆఫీసులో ప్రవేశించిన దగ్గర నుంచి ఆఫీసంతటిలో చైతన్యం వచ్చింది. క్లర్కులందరిలో ఉత్సాహం పుంజుకుంది. అంతవరకు రోజు విడిచి రోజు గడ్డం గీసుకునేవాళ్ళందరూ రోజూ నున్నగా గీసుకుని వస్తున్నారు. ఇదివరకు వారమైనా విడవకుండా కంపుకొట్టే షర్టులు వేసుకునేవాళ్ళందరూ, రోజు విడిచి రోజు మార్చేస్తున్నారు. ఇదివరకు తుప్పు పట్టినట్టు యీసురోమని కూర్చునేవాళ్ళందరు చలాకీగా కనపడుతున్నారు, ప్రతివాడు తనొక్కడిమీదే గీత "ఇంటరెస్టు" చూపుతూందని మనసులో పొంగిపోతున్నాడు. కాఫీలు ఆర్డరు చేయిస్తున్నారు. యింటిదగ్గిరనుంచి స్పెషల్ ఫలహారాలు చేయించుకొచ్చి, లంచ్ అవర్లో గీతకి ఆఫర్ చేస్తున్నారు.

అందరిలోకి వెంకట్రావుకి మరింత సంబరంగా వుంది. కారణం గీతకూడా తమ వీధిలో వుంటుంది, వచ్చేటప్పుడు వెళ్ళేటప్పుడు బస్సు స్టాండ్‌లో కలుస్తారు, బస్సులో మాట్లాడుకుంటారు. బస్ స్టాప్ నించి కబుర్లు చెప్పుకుంటూ నడుస్తారు ఈ కారణంగా మిగతా అందరికంటే, వెంకట్రావుతో గీత పరిచయం, చనువు ఎక్కువే. దాంతో యింక వెంకట్రావుకి పట్టపగ్గాలు లేకపోయాయి. గీతకి తనంటే ప్రేమ అని, తనంటే పడిచస్తుందని, తన అందానికి, మాటల చాతుర్యానికి బోల్తాపడిందని ఊహించుకుని, గర్వంగా కాలరెత్తుకు తిరగ సాగాడు. గీతతో కల్పించుకుని మాట్లాడడం, కొలీగ్స్ అందరి ఎదుట గీతతో జోక్స్ కట్ చేస్తూ తన మాటలకి తానే పగలబడి నవ్వడం - గీతకి ఆఫీసు కాగితాలలో అడగకపోయినా సహాయం చెయ్యడంతో మొదలుపెట్టి, మరికొన్నాళ్ళకి అడిగిన వాళ్ళకి, అడగని వాళ్ళకి గీత తనని చాలా లైక్ చేస్తున్నదని - గీత తన కోసం బస్ స్టాప్‌లో వెయిట్ చేస్తూ తనొస్తే తప్ప బస్సే ఎక్కదని, రోజూ సాయంత్రం తమింటికి తీసికెళ్ళి టీ తాగితే తప్ప వదలదని - యిద్దరూ కల్సి ఆదివారం సినిమాలకి, షికార్లకి వెడతామని వగైరా వగైరా గీత తనకెంత దగ్గిరయ్యిందో చెప్పుకుని సంతృప్తిపడ్తూ, సంతోషించసాగాడు.

మనసులో ఏ కల్మషమూ లేని గీత నిజంగా వెంకట్రావుని స్నేహితుడిగానే భావించింది చాలా రోజులు. అసలు వెంకట్రావు గీతతో తన పర్సనల్ విషయాల గురించిన ప్రసక్తి రాకుండా జాగ్రత్తపడేవాడు. ఆ వీధిలో వున్నా, ఎప్పుడూ గీత యింటికతను వెళ్ళడం తప్ప, గీతని తన యింటికి పిలిచేవాడు కాదు. ఇంట్లో అలివేలు, పిల్లలని వాళ్ళ ఖర్మానికి వాళ్ళని వదిలి, తను మాత్రం నీట్‌గా ముస్తాబయి పూలరంగడిలా తిరిగే వెంకట్రావుని చూచి, పెళ్ళి కాలేదనే అనుకుంది గీత. ఓ రోజు అలివేలుని ఎవరింట్లోనో పేరంటంలో చూసి వెంకట్రావు భార్యని, అతనికి నలుగురు పిల్లలని విని ఆశ్చర్యపడింది. "అరె మీకు పెళ్ళయిందని, నల్గురు పిల్లలని నాకు తెలియదే - చెప్పారుగాదే - మీ ఆవిడని చూశాను" అంది గీత బస్సులో - వెంకట్రావు మొహం మాడిపోయింది. "ఊ.... అయింది...." అంటూ గొణిగాడు. తరువాత ఓ సారి రెండుసార్లు గీత "పదండి మీ ఇంటికి వెడదాం" అంటూ చొరవగా వెంకట్రావు ఇంట్లోకి వెళ్ళి అలివేలుతో కలుపుగోలుతనంగా మాట్లాడింది. పాపం అలివేలు గీతలాంటి చదువుకున్నది, ఉద్యోగస్తురాలు అంత చనువుగా వుండేసరికి, రెండు మూడు సార్లు గీత ఇంటికి వెళ్ళి కష్టం సుఖం చెప్పడం మొదలుపెట్టింది అమాయకంగా.

"ఏమిటండీ వెంకట్రావుగారు! మీరు బొత్తిగా పాపం ఆవిడ గురించి, పిల్లలు గురించి పట్టించుకోకపోతే ఎలా అండి. ఆవిడ పాపం బొత్తిగా పట్టుమని పాతికేళ్ళు లేకుండానే ఎలా అయ్యారో" అంటూ చనువుగా మందలించింది గీత. గీతకి తమింటి సంగతంతా తెల్సిందని దాచి లాభంలేదని గ్రహించాడు వెంకట్రావు.

"ఆ ఇంటి సంగతి నాతో చెప్పకండి" అన్నాడు విరక్తిగా. గీత ఆశ్చర్యంగా చూసింది. వెంకట్రావు అదే సందని తన మనసులో బాధ అంతా వెళ్ళగక్కాడు. తన ఖర్మకొద్దీ అలివేలులాంటి మొద్దు పెళ్ళాంగా దొరికిందని - తన యిష్టం లేని పెళ్ళి జరిగిందని - తన జీవితంలో సుఖ

సంతోషాలు కరవయ్యాయని - అలివేలు మూలంగా తన జీవితం నాశనం అయిందని, చెప్పుకుని వాపోయాడు. గీత మౌనంగా వింది. "అయితే మాత్రం యిప్పుడేం చేస్తారు - యిష్టం లేనపుడు ధైర్యంగా చెప్పవలసింది" అంది.

"అదే గీతా నా పొరపాటు. నిజంగా ఆ ఒక్క పొరపాటువల్ల జీవితంలో నేను ఎంతో నష్టపోయాను - ఆ నష్టం ఎంతో నిన్ను చూశాక మరీ తెలుస్తూంది" అన్నాడు ఆవేశంగా.

"అదేమిటి ?" అంది గీత తెల్లబోతూ.

"అవును గీతా. నీలాంటి అందమైన, చదువుకున్న భార్యని పొందలేకపోవడం అన్నది తక్కువ దురదృష్టమా" - అన్నాడు విచారంగా. నిజంగా నాకే పెళ్ళికాకపోయివుంటే.... వుంటే".... అన్నాడు ఆవేశంగా ఆమె కళ్ళలోకి చూస్తూ.

గీత అదోలా చూసి తల దించుకుంది. అసలీమధ్య వెంకట్రావు ధోరణి అదోలా కనిపిస్తూంది గీతకి. - తను యిచ్చిన చనువుని దుర్వినియోగం చేస్తున్నాడు అన్పించింది గీతకి. అయినా ఆ విషయం గురించి గీత పెద్దగా పట్టించుకోలేదు. కాని తరువాత అలివేలుని చూశాక ....వెంకట్రావు మాటలు విన్నాక....

"ఏమిటి గీతా ఆలోచిస్తున్నావు - నా గురించి జాలిపడుతున్నావా ?" అన్నాడు వెంకట్రావు "అవును పాపం. నిజంగా మీ గురించి జాలిపడాలి." అంది అదోలా ఆమె. తనని అర్థం చేసుకుందని, సానుభూతి చూపిస్తూందని వెంకట్రావు తబ్బిబ్బు అయ్యాడు. "థ్యాంక్స్ గీతా థ్యాంక్స్! నీవన్నా నన్నర్థం చేసుకున్నావు." అన్నాడు సంతోషంగా.

ఆ తరువాత ఏదో సమయంలో భార్య గురించి చెప్పి యింట్లో తనెంత అశాంతి ఫీలవుతున్నదీ చెప్పేవాడు. రానురాను గీత తనంటే యిష్టం చూపిస్తుందని, మెత్తపడుతూందని, వలలో పడుతూంది అని

పించసాగింది వెంకట్రావుకి. తన మాటలు యింటరెస్టింగ్‌గా వింటూంది, తను ఏదో వంకన ఆమెని తాకినా చూడనట్టనిపిస్తూంది అంటే అర్థం మెత్తబడినట్టేగదా. ఆడది అంతకంటే ఏం చెప్తుంది, అనుకోసాగాడు వెంకట్రావు. ఆరునెలలు తిరిగేసరికి ఈ అవకాశాన్ని వృధా పోనివ్వద్దని మనసు హెచ్చరించేది, అతను విసుగ్గా వుంటే "ఏం అలా వున్నారు" - అంటూ గీత జాలిగా చూసేది.

"ఇంటికెళ్ళాం దగ్గరనించి పాల డబ్బాలు లేవు - బియ్యం లేదు. పప్పులేదు అంటూ ఆవిడ గోల, పిల్లవెధవల ఏడుపులు - గీతా ! నిజంగా యింటికెళ్ళాలంటే ఏడుపు వస్తుందనుకో - అందులో మరీ నీవు స్నేహం అయిన దగ్గిరనించి యింటి మొహమే చూడాలనిపించడంలేదు -

"అలాగా" అని చిలిపిగా నవ్వేది. ఆ నవ్వుకి మతిపోయేది వెంకట్రావుకి.

"గీతా" ఏదో చెప్పాలని ఆరాటపడేవాడు గీత "ఊ ఏమిటీ చెప్పండి" అనేది.

"ఏ లేదు- సినిమాకి వెడదామా అలా ఏ పార్కుకో వెడదామా" అనేవాడు. వెడదాం పదండి అనేది గీత వెంటనే - సంతోషంతో తల మున్కలు అయేవాడు వెంకట్రావు గీతలాంటి అమ్మాయిని ఆకర్షించిన తనని తాను చూసుకుని గర్వించడం మొదలుపెట్టాడు.

పరిచయం మరికొంచెం పెరిగాక సినిమాహాల్లో చీకట్లో గీత చెయ్యి పట్టుకున్నాడు ఓ రోజు. ఇదేమిటి వదలండి. అంది గీత బెట్టుగా. ఆమెది కేవలం బెట్టేనని అర్థమైనట్టు, వెంకట్రావు చేయినొక్కి "అబ్బ గీతా ! జీవితంలో ఇలాంటి అనుభూతులు వుంటాయని యిప్పుడే తెలుసు కున్నాను. ఆ గేదెతో పెళ్ళంటే అయింది కాని, ఇలాంటి అనుభవాలు ఎక్కడ రుచి చూశాను." అన్నాడు పారవశ్యంగా. "ఏం పాపం సిని మాకి తీసికెడతానంటే వద్దంటారేమిటి ఆవిడ" గీత కొంటెగా అంది "ఛాఛా దాంతో సినిమాకి కూడా వెడతానా ? సిగ్గుచేటు - వెళ్ళినా ఇలాంటి అనుభూతి దాని దగ్గిర దొరుకుతుందా -" అన్నాడు అలివేలుని గుర్తుతెచ్చు కుంటూ తిరస్కారంగా.

మరికాస్త చనువు పెరిగాక, ఓ రోజు ఆఫీసులో లంచ్ అవర్లో ఎవరూ దగ్గర లేకుండా చూసి రహస్యంగా "గీతా రేపు ఆదివారం అలా ఎటన్నా వెడదాం రాకూడదూ" అన్నాడు కాస్త భయపడుతూనే.

"ఎక్కడికి" అంది గీత —

"అలా వెడదాం, ఎవరికీ తెలీదులే — రూమ్ బుక్ చేస్తాను" గొణిగాడు. గీత కోపంగా చూసింది.

"భలేవారే స్నేహంగా వున్నాననా ఇలా అడుగుతున్నారు. అయినా మీకేంబాబు మీరు పెళ్ళయినవారు. నేను పెళ్ళిగావల్సినదాన్ని. నలుగురికి తెలిస్తే నా గతేం అవుతుంది. అప్పుడు మీరు ఆదుకుంటారా? నన్నింక ఎవరు చేసుకుంటారు. ఇంకెప్పుడూ ఇలా మాట్లాడకండి."

"ఎవరూ చేసుకోకపోతే నేను చేసుకుంటాను. నిన్ను పూవులో పెట్టి పూజిస్తాను." ఆవేశంగా అన్నాడు వెంకట్రావు.

"మరి మీ ఆవిడో, ఆవిడేం అవుతుంది?" అంది గీత.

"పుట్టింటికి పంపిస్తాను. ఏదో నెలకింత అని దానిమొహాన పడేయచ్చు. లేదంటే మనకెలాగో వంటా గింటా చేయడానికి మనిషి ఉండాలి గదా - ఇంట్లో పడుంటుంది." నిర్లక్ష్యంగా అన్నాడు వెంకట్రావు.

"ఆవిడ ఎందుకు వొప్పుకుంటుంది. ఆవిడ వూరుకుంటుందా" గీత సందేహంగా అంది.

"వప్పుకోకపోతే తన్ని తగలేస్తాను."

"కోర్టు కెక్కితే?"

"ఏడ్చింది దాని కామాత్రం తెలివితేటలు కూడా వున్నాయా?"

"ఎక్కారనుకోండి, కోర్టు మన పెళ్ళి చెల్లదంటే, అప్పుడు నా గతేం కాను"

"అబ్బా గీతా అంతదూరం ఎందుకు ఆలోచిస్తావు? పెళ్ళికాకపోతే నేం? మనిద్దరం హాయిగా వుండవచ్చు! మనని కాదనే శక్తి దానికిలేదు."

"ఉంపుడుగత్తెగా వుండాలన్నమాట!" గీత కాస్త కరుకుగా అంది. వెంకట్రావు కాస్త తడబడ్డాడు. "అదికాదు గీతా చట్టం ఒప్పుకోదు అనుకో, అంతమాత్రాన ఏ దేవాలయంలోనో మనం పెళ్ళిచేసుకో కూడదేమిటి."

"ఏమో బాబు, మీ మగాళ్ళ మాటలు నమ్మమని ఏముంది. మీ అవసరం తీరాక చల్లగా జారుకుంటారు."

"ప్రమాణం చేస్తాను గీతా, నీవు నాదానివయితే చాలు ఏం చెయ్యమన్నా చేస్తాను."

"కాగితంమీద రాసి యిస్తే ఆలోచిస్తాను." అంది గీత సాలోచనగా.

"ఏమని రాయమంటావు" కాస్త అనుమానంగా, సందిగ్ధంగా అడిగాడు. "అయినా నామీద నీకంతమాత్రం నమ్మకం లేదన్నమాట" కాస్త అసహనంగా అన్నాడు.

"కోపం వచ్చిందా - పోనీ ఎవరైనా ఓ ఇద్దరు సాక్షులముందు మాట ఇస్తే చాలు. అదిగో ఏవండీ గోపాలంగారూ, సుబ్బారావుగారూ ఒక్కసారి యిటురండి చిన్న పనుంది" అంటూ పిలిచింది. వెంకట్రావు గాబరాగా "గీతా అందరికీ ఎందుకు చెప్పడం" అని వారిస్తూనే వున్నాడు. గీత వాళ్ళని గట్టిగా పిలవనే పిలిచింది.

"ఏమిటి-" అంటూ సుబ్బారావు, గోపాలరావు కాక మిగతా స్టాఫ్ అంతా గీత చుట్టూ కుతూహలంగా మూగారు. వెంకట్రావు మొహం ఎర్రబడింది. గాబరాపడ్డాడు.

"ఓ మంచి శుభవార్త చెపుతున్నా - వెంకట్రావుగారు నన్ను పెళ్ళాడబోతున్నారు. దానికి మీరంతా సాక్షులు" గీత చలాకీగా అంది. అందరూ నోరెళ్ళబెట్టారు. వెంకట్రావుకి చమటలు పట్టడం ఆరంభించింది. కాసేపటకి అంతా తేరుకుని "ఏమిటీ" అంటూ నమ్మలేనట్లు ఆశ్చర్యంగా సాగదీశారు. "వెంకట్రావుకి యిదివరకు పెళ్ళయింది - నలుగురు పిల్లలు" ఇద్దరు, ముగ్గురు ఒకేసారి అన్నారు.

"అయితే ఏమండీ, పెళ్ళాం, నలుగురు పిల్లలు వున్నంతమాత్రాన పెళ్ళిచేసుకోకూడదనీ రూలుందా. రూలుంటే మాత్రం ఆయనకేం లెక్క. అందుకే దేముడి గుళ్ళో పెళ్ళాడతానన్నాడు." గీత నిర్లక్ష్యంగా అంది. అంతా మరోసారి నోరు వెళ్ళబెట్టారు.

"ఘోరం.... కట్టుకున్న పెళ్ళాం, నలుగురు పిల్లలు వుండగా యిదేం అన్యాయం" ఎవరో అన్నారు.

"ఏమిటండి - ఆ పెళ్ళాం ఓ పెళ్ళామా - మొద్దు రాచ్చిప్పలా వుండే ఆ పల్లెటూరి మొద్దుకి, వెంకట్రావుగారి లాంటి అందగాడు, ఆధునికుడికి సరిపోయేదేనా చెప్పండి. ఏదో కట్నంకోసం పెళ్ళాడారు. ఆడది కావాలి గనక పిల్లల్ని కన్నారు. ఛా.... ఛా.... ఆవిడని చూస్తేనే వెంకట్రావుగారికి తగదని తెల్సిపోయింది! పాపం ఆయన గనక ఇంకా ఇన్నాళ్ళు కాపురం చేశారు" గీత వాగ్ధోరణి సాగుతూంది. వెంకట్రావు వారించాలని చూసినా వినిపించుకోడంలేదు.

"గీతా!" ఆ ఆఫీసులోనే పనిచేస్తున్న మరో అమ్మాయి గీత ధోరణి సహించలేక "గీతా నీవేనా ఇలా మాటాడుతున్నది? ఆడదానివయి వుండి మరో ఇల్లాలి ఉసురు పోసుకోవాలనుకుంటున్నావా- నీకు కావాలంటే వెంకట్రావు పాటి మొగుడే దొరక్కపోయాడా? అయినా ఆఫీసరు కూతురివి, చదువు, అందం, అన్నీ వుండి పెళ్లాం, పిల్లలున్నవాడిని పెళ్లాడే ఖర్మ నీకేమిటి? మొగాడు అతనికి బుద్ధి లేకపోతే నీ బుద్ధి ఏమయింది. పాపం! ఆ నలుగురు పిల్లల తల్లి గతి ఏమవుతుందనుకున్నావు".... ఆవేశంగా పట్టుకు దులిపేసింది. అందరూ ఆ మాటలను ఆమోదిస్తున్నట్టు తలలాడించారు. గీత చిద్విలాసంగా నవ్వుతూ, "స్టాప్! మైడియర్ స్టాప్ పై మాటలన్నీ అన్నది నేనుకాదు. వెంకట్రావుగారు. ఆయనకి పాపం ఆ పెళ్లాం తగదని నన్ను చేసుకోవాలనుకుంటున్నారు,"

వెంకట్రావు యింక వూరుకోలేక "గీతా" తీక్షణంగా వారించాడు. గీత అంతకంటే తీక్షణంగా చూసింది.

"ఏం అంత భయపడుతున్నారు. పెళ్ళాడుతా నన్నారుగా - ఎప్పుడైనా తెలిసేది యిప్పుడే తెలిస్తే వచ్చే నష్టం ఏం లేదులే - అయ్యో, ఈ వెంకట్రావుకి పాపం ఒక పెళ్ళాం చాలలేదట. తను చాలా అందమైన వాడినని ఆయనగారికి చాలా నమ్మకం. మైదాపిండి ముద్దలా, మొహం వున్న ఈ అందగాడిని చూసి, ఆడపిల్లలందరూ వెంటపడి ప్రేమిస్తారని చాలా నమ్మకం. తనలాంటివాడికి ఆ భార్య తగదని అంతకంటె విశ్వాసం. ఆ భార్య అలా అవడానికి కారణం తనే అన్నది ఈ ప్రబుద్ధుడికి అర్థం కాదు. ఏడాదికి ఒక పిల్లని కని పెళ్లాం తోలులా తయారవడానికి కారణం తనే అని గ్రహించడు. ఈయనగారి కొచ్చే ముష్టి మూడొందల జీతంతో, ఈయన పెట్టిన దాసదాసీ జనంతో, యీయనగారు కొనే చీనిచీనాంబరాలతో ఆ యిల్లాలు అంతకంటే నీటుగా, నాజూగ్గా ఎలా వుంటుంది అన్నది ఆలోచించడు. నలుగురు పిల్లల తల్లి వంటింట్లోపడి కొట్టుకోకుండా, ఈయనగారితో సోగ్గా తయారయి ఎలా కుర్చీలో కూర్చుంటుంది అన్న ఆలోచన రాదు. ఈయనగారి సంపాదనకి ఒక పెళ్ళాం చాలక మరొకర్తిని కట్టుకుంటాడట."

"గీతా" అవమానంతో కోపం పట్టలేక అరిచాడు వెంకట్రావు.

"షటప్. నన్నలా పిలిచే అధికారం నీ కెవ్వరిచ్చారు? నీ మొహానికి ఆవిడ తగదూ? నీ ప్రతాపం ఆడదానిమీదా చూపిస్తావు? ఆవిడ కనక ఆ నలుగురి పిల్లలకోసం నిన్ను భరించి అంతా సహిస్తూంది. నాలాంటిదైతే లేచిపోను. ఆవిడకి నీలాంటి నీచుడు తగడని అర్థం చేసుకో...." గీత తీక్షణంగా పట్టుకు దులిపేస్తూంది. వెంకట్రావు నల్లబడ్డ మొహంతో విస విస బయటికి వెళ్ళిపోయాడు.

• • •

ఆ రోజు చాలా రోజుల తర్వాత - ఏళ్ళ తరువాత - మొగుడు సినిమాకి తీసికెడతాననగానే సంబరపడిపోయింది అలివేలు. చకచక పిల్లల మొహాలు కడిగి, బట్టలు తొడిగి - మొహం కడుక్కుని పెట్టె అడుగున వున్న ఒకే ఒక మంచి చీర - పెళ్ళినాటి పట్టుచీర తీసి కట్టుకుని, ముస్తా

బయి రిక్షా ఎక్కింది చంటిపిల్లలా ఆనందపడ్తూ. మొగుడంత సౌమ్యంగా వుండడానికి కారణం తెలీదు అలివేలుకి ఆనాడు. ఆ కారణం తరవాత తెల్సింది. తెలిశాక సోపుల పెట్టెలో మొగుడికి తెలియకుండా పిల్లలు ప్రాణాలు కొరికితే, బిస్కట్లు, చాక్లెట్లు కొనడానికి దాచుకున్న పావలా, అర్ధా చిల్లర అంతా తీసి లెక్కపెట్టింది. నాలుగు రూపాయలైంది. ఓ జాకెట్టుగుడ్డ కొని, ఆ రోజు వరలక్ష్మి వ్రతం చేసుకున్నాను రమ్మంటూ గీతని పిలిచి, బొట్టుపెట్టి తాంబూలం, రవికలగుడ్డ యిచ్చింది "ఇది ఎందుకండీ అక్కయ్యగారూ" అంది గీత మొహమాటంగా. "ఉంచమ్మా - నీవు చేసిన మంచిపనికి కృతజ్ఞతగా యింతకంటె యిచ్చేందుకు నా దగ్గరేం లేదు." అంది అలివేలు అభిమానంగా - గీతకి ముందు అర్ధం కాలేదు - అర్ధమయ్యాక నవ్వేసింది - "మంచిపని చేశానంటారా" అంది. "ఇంకా అనుమానమా - ఒక్కటే విచారంగా వుంది. నా మొహం చూసి చేయకుండా విడిచిపెట్టానన్నావే. బాగా బుద్ధి వచ్చేట్టు అదికూడా పూర్తిచేస్తే ఇంకా సంతోషించేదాన్ని" అలివేలు హాస్యంగా అంది. గీత అలివేలుని విస్మయంగా చూసింది. కాస్త సందేహిస్తూ "అక్కయ్యగారూ ఒక మాట అడగనా - వరలక్ష్మి వ్రతం చేసినట్టున్నారు. ఎందుకోసం చేస్తారండీ ఆ వ్రతం. ఆహా! తెలుసుననుకోండి మరోపక్క ఇలా నోములూ, వ్రతాలూ, పూజలు చేస్తూంటారు. మరోపక్క ఇలా అంటున్నారేమిటి?" అంది. అలివేలు ఒక్కక్షణం అర్ధం కానట్టు చూసి తరువాత పకపక నవ్వింది. "అమ్మో గడుసుదానివే, బలే ప్రశ్న వేశావు? అయ్యో రాత అదేనమ్మా గమ్మత్తు లోకంకోసం ఆమాత్రం చెయ్యకపోతే ఎలా తల్లీ. నాలాంటి వాళ్ళందరూ చేతలలోనే పతివ్రతలు. లోకానికి కావల్సింది అదేగా. అయినా ఏదో ఒక మొగుడంటూ చల్లగా వుండకపోతే ఆడది బతకలేదుగదా మన దేశంలో. అలాంటప్పుడు ఆ మొగుడికోసం ఈ వ్రతాలు గట్రా చేయకపోతే ఎట్లా చెప్పు - నీకర్ధం కాదులే ఏదో చదువు సంధ్య లేనిదాన్ని - పిచ్చిదాన్ని." అంటూ నవ్వింది ఆ మహా ఇల్లాలు.